
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.5
కనిష్ఠం 23.2

ANDHRAJYOTHY



నల్లగొండ

5

ఆదివారం 3 నవంబరు 2024

తుదిదశకు యాదాద్రి థర్మల్ పనులు



- రెండు యూనిట్ల పనులు ఇప్పటికే పూర్తి
- రూ.35 వేల కోట్ల వ్యయం
- నేడు యూనిట్-1 ఆయిల్ సింక్రనైజేషన్
- స్విచ్ఆన్ చేసి ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి

7

కుటుంబ సర్వేకు సన్నద్ధం



పైలట్ గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలో ఇంటింటి కుటుంబ సర్వేకు యంత్రాంగం సన్నద్ధమైంది. ఈనెల 6వ తేదీ నుంచి సర్వే పూర్తిస్థాయిలో ప్రారంభంకానుంది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి సర్వేను ఎన్యూమరేటర్లు నిర్వహించనున్నారు.

-(ఆంధ్రజ్యోతి,నల్లగొండ,యాదాద్రి,సూర్యాపేట కలెక్టరేట్)

- 6వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో ప్రారంభం
- ఉమ్మడి జిల్లాలో 8వేల మంది ఎన్యూమరేటర్లు
- తొలుత ఇంటింటికీ స్టిక్కరింగ్‌తో పాటు నెంబర్లు

సమగ్ర సర్వే సందర్భంగా అన్ని గ్రామాలతోపాటు, పట్టణాల్లో ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరిస్తారు. అనంతరం సర్వే పూర్తయినట్టు ప్రతీ ఇంటికి స్టిక్కర్ అంటించి నెంబర్లు కేటాయిస్తారు. ఎన్యూమరేటర్లు మ్యాప్‌తో ఇళ్ల జాబితాను, పూర్తి వివరాలను వారి వద్ద ఉంచుకుంటారు. ఎన్యూమరేటర్‌కు ఏవైనా సందేహాలు వస్తే వారికి సూపర్‌వైజర్లు, మండలస్థాయి అధికారులు అందుబాటులో ఉండి అనుమానాలను నివృత్తి చేస్తారు. ఎన్యూమరేటర్లు పూర్తి చేసిన ఫాంలను, ఇళ్లకు అతికించిన స్టిక్కర్లును ఆయా ఇళ్ల జాబితాను సూపర్‌వైజర్లు పరిశీలిస్తారు. మునిసిపల్ పట్టణ ప్రాంతాల్లో నిర్దేశించిన ఎన్యూమరేటర్‌లతో పాటు రిజర్వ్‌లో మరికొంత మంది ఎన్యూమరేటర్లను కూడా అధికారులు సిద్ధంగా ఉంచుతున్నారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలు,ఎన్యూమరేటర్ల సర్వేను పరిశీలిస్తారు. సమగ్ర కుటుంబ సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజల సహకారం తప్పనిసరి నేపథ్యంలో ఇప్పటికే అధికార యంత్రాంగం సర్వేపై వారికి సమాచారం ఇచ్చే ఆలోచనలో ఉంది.

ఇంటింటి సర్వేకు 8వేల మందికిపైగా

ఉమ్మడి జిల్లాలో ఇంటింటి కుటుంబ సర్వేకు మొత్తం 8వేల మందికి పైగా ఎన్యూమరేటర్లు అవసరం. నల్లగొండ జిల్లాలో 4వేల మంది అవసరం కాగా, ఇప్పటికే సుమారు 2,800మంది అందుబాటులో ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో సుమారు 2,600మంది, యాదాద్రి జిల్లాలో 1,800 అవసరం. నల్లగొండ జిల్లాలో సుమారు 5లక్షల కుటుంబాలు, యాదాద్రి జిల్లాలో మొత్తం 2,31,896 కుటుంబాలను ఎన్యూమరేటర్లు సర్వే చేయనున్నారు. ఎన్యూమరేటర్లుగా అత్యధికంగా టీచర్లను నియమించారు. ఇప్పటి వరకు గుర్తించిన ఎన్యూమరేటర్లలో తొలత కొంతమందిని నియమించి మిగతా వారిని తరువాత తీసుకోనున్నారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, వివిధ శాఖల్లో పనిచేసే జూనియర్ అసిస్టెంట్‌లు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, సీఆర్‌పీలను ఎన్యూమరేటర్‌లుగా తీసుకోనున్నారు. సర్వే నిర్వహించిన అనంతరం వెంటనే డేటా ఎంట్రీ చేసేందుకు డాటా ఎంట్రీ ఆపరేటర్లను, సిస్టమ్స్‌ను అందుబాటులో ఉంచనున్నారు. ఎన్యూమరేటర్‌లకు ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు తయారు చేసి ఇవ్వడంతో పాటు స్టిక్కర్లను ఇప్పటికే ముద్రించి సిద్ధంగా ఉంచారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా ఎస్జీటీ టీచర్లతో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించనున్న నేపథ్యంలో ఈనెల 4, 5వ తేదీన శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల టీచర్లతో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించేందుకు నిర్ణయం తీసుకోవడంతో పాటు ఇతర శాఖల సిబ్బంది సహకారం కూడా తీసుకోనుంది.

పకడ్బందీ నిర్వహణ కోసం

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఈ సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ప్రణాళిక రూపొందించారు. ముందుగా ఇళ్ల జాబితాను తయారు చేయడంతోపాటు సమగ్ర కుటుంబ సర్వేపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సమాచారం..

- మిగతా 6వ పేజీలో...



సర్వేపై వీడియో కాన్ఫరెన్స్‌లో సూచనలు చేస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పాల్గొన్న నల్లగొండ జిల్లా కలెక్టర్

పిచికారీ
రోగాలతో సవారీ

ఉమ్మడి జిల్లాలో అనారోగ్యాల బారిన రైతులు

శాస్త్రవేత్తల అధ్యయనంలోనూ విస్తుపోయే విషయాలు



పంటలపై క్రిమిసంహారక మందుల పిచికారీతో రైతులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. పిచికారీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోకపోవడం, అవగాహన లేకపోవడంతో ఆరోగ్యాలను దెబ్బతీసుకుంటున్నారు. మందుల పిచికారీ సమయంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ ఉస్మానియా యూనివర్శిటీ, హైదరాబాద్‌కు చెందిన బృందం ప్రపంచ ఆరోగ్య సంస్థ పర్యవేక్షణలో యాదాద్రి-భువనగిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని అధ్యయనం చేసింది. ఇందులో విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. చాలామంది రైతులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు స్పష్టమైంది. ఇదిలా ఉండగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పంటలపై క్రిమిసంహారక మందుల పిచికారీకి సంబంధించి ఆంధ్రజ్యోతి సర్వే నిర్వహించింది. ఇందులో చాలామంది రైతులు మందుల పిచికారీతో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తేలింది. అదేసమయంలో రైతులు ఎవరూ జాగ్రత్తలు తీసుకోవడం లేదని స్పష్టమైంది.

6 - (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ వ్యవసాయం)

న్యూస్ బాక్స్

రైతులపై నిర్లక్ష్యం తగదు

కిసాన్ మోర్చా జాతీయనేత గోలి మధుసూదన్‌రెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు

నల్లగొండ రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రైతులపై నిర్లక్ష్యం తగదని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయనేత గోలి మధుసుధన్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణ పరిధిలోని ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ధాన్యం నిల్వ చేసే గోదాములను సందర్శంచారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు 10 రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. అకాల వర్షం కారణంగా ధాన్యం కొట్టుకుపోయిందని, మిగిలిన ధాన్యం మొలకెత్తుందని, దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నేత పిల్లి రామరాజు, పోతెపాకల సాంబయ్య, వెంకటేశం, జగ్జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను పీక్కుతుంటున్న కార్పొరేట్ శక్తులు

జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి

వేములపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత బీజేపీ పాలనలో కార్పొరేట్ శక్తులు ప్రజలను పీక్కుతింటున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలో నిర్వహించిన 8వ మండల మహాసభలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో జరిగిన ప్రతీ పోరాటం, ప్రజా సమస్యల వెనుక కమ్యూనిస్టులు ఉన్నారన్నది గుర్తుంచుకోవాలన్నారు. నేడు ప్రపంచం మొత్తం ఎర్రజెండా విధానాలను అనుసరిస్తూ కమ్యూనిస్టుల వైపు చూస్తోందన్నారు. శ్రీలంకలో కమ్యూనిస్టు రాజ్యం రావడానికి ఇదే నిదర్శనమన్నారు. దేశం, రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయేలా పాలన సాగుతుందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, గౌతంరెడ్డి, రొండి శ్రీనివాస్, పాదూరి గోవర్ధని, వరలక్ష్మీ, చిన్న సైదులు, మంగారెడ్డి, ఆయూబ్, పరుశురాములు, సీతారాములు, చైతన్య, సత్తిరెడ్డి, ప్రణీత్‌రెడ్డి, ధర్మయ్య, సంపత్, సైదులు, భిక్షం, ఇందిరమ్మ, లింగస్వామి పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో పొరపాట్లకు తావివ్వకూడదు

పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్, పాల్గొన్న కలెక్టర్

నల్లగొండ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వానాకాలం ధాన్యం సేకరణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నిర్వహించాలని పౌరసరఫరాలు, ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ధాన్యం రాక మొదలైందని, రానున్న నెల రోజులపాటు కలెక్టర్లు ధాన్యం సేకరణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వానాకాలంలో రాష్ట్రవ్యాప్తంగా 150 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.20వేల కోట్లు ధాన్యం సేకరణకు కేటాయించిందన్నారు. ధాన్యం సేకరణలో భాగంగా ఈ ఏడాది కొత్తగా మిల్లింగ్ చార్జీలను పెంచామని, సన్నధాన్యానికి, దొడ్డు ధాన్యానికి ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సన్నధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. సీఎంఆర్ కోసం మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ సమర్పించేందుకు ఆదేశాలు జారీ చేవామన్నారు. కేవలం 10శాతం బ్యాంక్ గ్యారంటీ తీసుకొని ధాన్యాన్ని కేటాయిస్తామన్నారు. పక్క రాష్ట్రాల్లో 100శాతం బ్యాంక్ గ్యారంటీ తీసుకుంటున్నారని తెలిపారు. కలెక్టర్లు ప్రస్తుతం ఉన్న గోదాముల సామర్థ్యానికి అదనంగా నిల్వకు మరిన్ని గోదాములను గుర్తించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 7,572 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నది లక్ష్యమన్నారు. ఇంకా ఎక్కడైనా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకుంటే తక్షణం ప్రారంభించాలని ఆదేశించారు. ధాన్యం సేకరణలో ఎలాంటి సమస్యలు రాకుండా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పౌరసరఫరాలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ డీఎస్ చౌహాన్ ధాన్యం సేకరణపై పలు సూచనలు చేశారు. వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ హరీష్, వ్యవసాయశాఖ జేడీ శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు
గాడినపడేనా!

- కేంద్రాల వద్ద వెలుగులోకి పలు సమస్యలు
- గోదాముల వద్ద అన్‌లోడింగ్‌కూ ఆటంకాలే..
- ఎట్టిపరిస్థితుల్లో కేంద్రాల వద్ద ధాన్యం ఆగవద్దని కలెక్టర్ సూచన
- మిల్‌పాయింట్లకు బారులు తీరుతున్న ధాన్యం ట్రాక్టర్లు
- మిల్లుల్లో సన్నధాన్యం అమ్ముకొని బోనస్ కోల్పోతున్న రైతాంగం
- మిల్లులకు ధాన్యం కేటాయింపులకు కుదిరిన అవగాహన



సర్వేలో పార్టీ శ్రేణులు భాగస్వాములు కావాలి

ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్

నల్లగొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న బీసీ కులగణన, సమగ్ర కుటుంబ సర్వేలో పార్టీ శ్రేణులంతా భాగస్వాములు కావాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయం సమీపంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన కాంగ్రెస్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యేలు బాలునాయక్, వేముల వీరేశం, కుందూరు జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, నాయకులు మాట్లాడుతూ, పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పులకుప్పగా మార్చారని విమర్శించారు. గత ప్రభుత్వం రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేసిందని, ప్రస్తుతం ఆలస్యమైనా అందరి రైతులకు రుణమాఫీ చేసి తీరుతామన్నారు. బీఆర్ఎస్ హయాంలో నల్లగొండ జిల్లాలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో 531 గ్రామాలకు తాగునీటిని అందజేశామన్నారు. వచ్చే మూడేళ్లలో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకెళ్తోందన్నారు. గ్రామాల్లో ఉనికి కోల్పోతామనే భయంతో బీఆర్ఎస్ నాయకులు కులగణనను అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అందరికీ సమన్యాయం జరగాలని రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు రాష్ట్రంలో బీసీ కులగణనను చేపట్టామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్‌రెడ్డి పిచ్చిపట్టినట్లు మాట్లాడుతున్నారని, ఎవరు ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ పదేళ్ల అధికారంలో ఉండటం ఖాయమన్నారు. కుటుంబ సర్వేతో ప్రజల ఆర్థిక స్థితిగతులను తెలుసుకొని వారికి కావాల్సిన పథకాలను అమలు చేయనుందన్నారు. సమగ్ర కుటుంబ సర్వేతో రాష్ట్రం దేశానికి రోల్ మోడల్‌గా నిలువనుందన్నారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు కొండేటి మల్లయ్య, అబ్బగోని రమేష్, జూకూరి రమేష్, వంగూరి లక్ష్మయ్య, సిరాజ్ ఖాన్, కత్తుల కోటి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మాల, మాల ఉద్యోగుల
స్వాభిమాన సభ

నల్లగొండ క్రైం, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఆదివారం మాల, మాల ఉద్యోగుల స్వాభిమాన సభను నిర్వహించనున్నట్లు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ గోలి సైదులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని చర్లపల్లి బైపాస్ వద్ద ఉన్న ఎస్ఆర్ఎస్ గార్డెన్‌లో సభను ఉంటుందని, ఈ సభకు కాంబ్లే, రెంజర్ల రాజేష్, రాజేష్ మహాసేన, మంచాల లింగస్వామితోపాటు సీనియర్ మాల మహానాడు నాయకులు హాజరవుతారని తెలిపారు. ఆయనవెంట లకుమాల మధుబాబు, కో చైర్మన్‌లు రేకల సైదులు, బోగరి విజయ్ కుమార్, తెలగమల్ల యాదగిరి, గాలి రవికిషన్ ఉన్నారు.

నీటిలో ముగ్గురు గల్లంతు

7

సీఎంఆర్‌కు మిల్లర్లు సహకరించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



తిప్పర్తి మార్కెట్ యార్డులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వానాకాలం ధాన్యం సేకరణ, కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సకాలంలో చెల్లించేందుకు రైస్ మిల్లర్లు సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం కలెక్టర్ తన ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.రాష్ట్ర ప్రభు త్వం ధాన్యం సేకరణ, కస్టం మిల్లింగ్ రైస్ విషయంలో మా ర్పులు తీసుకువచ్చిందన్నారు. మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ సమర్పించాలని, సాధ్యమైనంతవరకు ధాన్యం సేకరణకు సహకరించాలన్నారు. 10 రోజుల్లో బ్యాంక్ గ్యారంటీ సమర్పించేందుకు అండర్ టేకింగ్ ఇవ్వాలన్నారు. జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు నారాయణ, మిర్యాలగూడ రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ, సీఎంఆర్ సకాలంలో చెల్లించేందుకు మిల్లర్లకు అవసరమైన వసతులు కల్పించాలని, బ్యాంక్ గ్యారంటీ అండర్ టేకింగ్ సమయాన్ని 15 రోజులకు పెంచాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ట్రాన్స్‌పోర్టు బిల్లులు, మిల్లింగ్ చార్జీలు చెల్లించాలని, అదే విధంగా బియ్యం చెల్లించే శాతాన్ని తగ్గించాలని కోరారు. దీంతో 15 రోజుల్లో బ్యాంక్ గ్యారంటీ సమర్పించేందుకు కలెక్టర్ అంగీకరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా పౌ రసరఫరాలశాఖ అధికారి వెంకటేశ్వర్లు, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ హరీష్, వ్యవసాయ శాఖ జేడీ శ్రవణ్, ఎల్‌డీఎం శ్రామిక్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయొద్దు

(ఆంధ్రజ్యోతి, తిప్పర్తి): ధాన్యం కొనుగోళ్ల వివరాల న మోదులో ఎలాంటి అలసత్వం చూపవద్దని కలెక్టర్ ఇలా త్రి పాఠి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు, అంతయ్యగూడెం గ్రా మంలోని ఐకేపీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. వర్షం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున వెంటనే కొనుగోళ్లు చేప ట్టి ధాన్యాన్ని తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ స్వప్న, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



కార్తీక సందడి షురూ

7

కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో శనివారం సందడి నెలకొంది. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో శనివారం కార్తీక వ్రతాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో కొండకింద వ్రత మండపాలు నిండిపోయాయి. కార్తీక మాసం తొలి రోజు ఆరు విడతల్లో జరిగిన వ్రత పూజల్లో 498 జంటలు పాల్గొని సత్యదేవుడి వ్రతాలు ఆచరించి మొక్కు తీర్చుకున్నాయి.

పిచికారీ రోగాలతో సవారీ

పూర్వకాలంలో కేవలం సేంద్రీయ వ్యవసాయంపైనే ఆధారపడేవారు. పశువుల ఎరువులతో పాటు రకరకాల సంపద్రాయ పద్ధతుల్లో పంటలు పండించేవారు. ఎటువంటి రసాయనాలు లేవు. తరువాత కాలంలో జనాభా పెరగడంతో వారికి సరిపోను ఆహార ఉత్పత్తులు ఉండేవి కావు. 1980వ దశకం నుంచే హరిత విప్లవంలో భాగంగా హైబ్రీడ్ విత్తనాలు, పురుగు మందులు మార్కెట్లోకి వచ్చాయి. వ్యవసాయం వ్యాపారంగా మారింది. వాతావరణంలో మార్పులు పంటల ఎదుగుదలకు ఆటంకాలుగా మారాయి. పంటల సాగులో సేంద్రీయం ఊసే లేకుండాపోయింది. విత్తనం నాటిన దగ్గర నుంచి మొక్క పెరిగే వరకు పురుగు మందుల వాడకం పెరిగింది. అయితే మందులు పిచికారీతో రైతులు తీవ్రఅనారోగ్యానికి గురువుతున్నారు. దీర్ఘకాలిక రోగాల వ్యాప్తితో మృత్యువాతపడుతున్నారు. కానీ రైతులు మందుల పిచికారీతో వచ్చే పర్యవసనాలను గుర్తించలేకపోతున్నారు.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ(వ్యవసాయం)

● క్రిమిసంహారక మందుల పిచికారీలో కనీస జాగ్రత్తలు తీసుకోని రైతులు ● పొంచిఉన్న ఆరోగ్య సమస్యలు ● డబ్ల్యూహెచ్ఓ పరిశోధనలో వెల్లడి

వరి సాగులో సీజన్‌కు తెగుళ్లను అనుసరించి 4-6 సార్లు, పత్తి పంటకు 10 సార్లు, మిర్చి, ఇతర పంటల్లో లెక్కకు మించి క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా పంటల్లో క్రిమిసంహారక మందుల పిచికారీ పెరిగింది. ప్రస్తుతం ఏ పంట వద్దకు వెళ్లినా రసాయనాల గాఢత తెలుస్తోంది. గాలి, నీరు పూర్తిస్థాయిలో కలుషితమయ్యాయి. వ్యవసాయంలో రసాయనాల వాడకం సాధారణ విషయంగా మారింది. ఈ పురుగు మందులతో మానవుడి ఆరోగ్యానికి పెద్దముప్పు ఏర్పడుతుందని పలుసంస్థలు పరిశోధనల నివేదికలు తెలియజేస్తున్నాయి. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్ బృందం ప్రపంచ ఆరోగ్య సంస్థ పర్యవేక్షణలో అక్టోబరు 2021-ఏప్రిల్ 2023 మధ్యలో యాదాద్రి-భువనగిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని రైతులపై అధ్యయనం చేసింది. ప్రధాన పంటలైన వరి, పత్తి, ఇతర పంటల సాగు చేసే 18-70 ఏళ్ల వయస్సు ఉన్న రైతులు ఏడాది పాటు క్రిమిసంహారక మందులు పిచికారీ చేసే వారి రక్తం, మూత్రం నమూనాలు సేకరించి లోతైన పరిశోధనలు సాగించారు.



పంటలకు పిచికారీ ఇలా..

● వరి సాగు ప్రధానంగా కాట్రాఫ్‌హైడ్రోక్లోరైడ్, పెండాల్, విండెక్స్ కార్బ్ మందులను సుమారు 4-5 సార్లు మందులు పిచికారీ చేస్తారు. పత్తి పంటకు సుమారు ఆరు పర్యాయాలు పిచికారీ ఉంటుంది. సైపర్‌మిత్రిన్, దోమ నివారణకు ప్రమాదకర రసాయానాలు వాడతారు. మిర్చి పంట ఆరు నెలల్లో సుమారు 20-30సార్లు పైరాజోల్, ఎక్స్సీనస్, థియామెథోక్సమ్, ఐసోసైక్లోసెరం, పైరిప్రాక్సీఫెన్ వంటిప్రమాదక రసాయానాలు పిచికారీ చేస్తారు. కూరగాయల్లో ఇతర పంటల్లో లెక్కకు మించి పిచికారీ చేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

● పురుగు మందుల వాడకం, పిచికారీతో రైతులు అప్రమత్తంగా ఉండాలి.

● ఎరువులు, మందులు పిచికారి చేసేటపుడు శరీరానికి తగలకుండా దుస్తులు ధరించడం, మాస్కులు, కళ్లకు గ్లాసులు పెట్టుకోవాలి.

● నిషేధిత జాబితాలోని మందులు గుర్తించాలి.

● ఆహార పదార్థాలతో పాటు పురుగు మందులను నిల్వ చేయవద్దు.

● పిచికారీ చేసే సమయంలో రక్షణ వస్త్రాలను ధరించాలి.

● గాలి దిశలో పిచికారి చేయాలి.

● చిల్లుపడిన, పాడైన స్ప్రేయర్‌ను లేదా డస్టర్‌ను వాడవద్దు.

● పిచికారీ చేసేటపుడు ఎటువంటి ఆహార పదార్థాలు తినవద్దు. తాగవద్దు.

● మందులు పిచికారీ చేసేటపుడు విషప్రభావానికి గురైనపుడు వైద్యుడికి పురుగు మందు డబ్బా, వివరాల కరపత్రాన్ని చూపిస్తే సరైన చికిత్స పొందవచ్చు.

పంట	సాగుకాలం	పిచికారీ ఎన్నిసార్లు	ఎంతసమయం (ఒకసారి- ఎకరాకు)
వరి	120-150రోజులు	ఐదుసార్లు	గంట
పత్తి	ఆరు నెలలు	4-5సార్లు	గంటలోపు
మిర్చి	ఆరు నెలలు	20-25సార్లు	గంటలోపు

ఉమ్మడి జిల్లాలో విస్తీర్ణం(ఎకరాల్లో)

జిల్లా	వరి	పత్తి	కంది	మిర్చి	ఇతర	రైతులు
యాదాద్రి	276104	105953	3914	0	1657	లక్ష
సూర్యాపేట	472929	78094	1888	0	6987	1.70లక్షలు
నల్లగొండ	510195	537314	2459	2383	1088	2.50లక్షలు

ప్రమాద రసాయనాలు

మొత్తం 23 వివిధ రకాల క్రిమిసంహారక మందులను 11 కేటగిరీలుగా విభజించి రీసెర్చ్ బృందం పరిశోధనలు చేసింది. కోమోఫోస్, పెనామిఫోస్, డైక్లోరోవాస్, మెథామిడోఫాస్, మోనోక్రోటోపాస్, ట్రైజోఫాస్, కాలం చెల్లిన రసాయనిక మందులు అత్యంత ప్రమాదకర మందులుగా గుర్తించింది.

మానవ ఆరోగ్యానికి ముప్పు

పంటల్లో క్రిమిసంహారక మందుల పిచికారీతో మానవ ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోంది. రసాయనాల గాఢతతో బలహీనత, ఛాతి బరువు, చెమట పట్టడం, గుండెవేగం తగ్గడం, పిల్లికూతలు, డిప్రెషన్ వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఆలస్యమైతే కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. గడ్డి మందు చాలా ప్రమాదకరం. దీనిని పీల్చడం, చర్మానికి తగలడం వలన ఊపిరితిత్తులు గట్టిపడి, కిడ్నీలు చెడిపోయి ప్రాణప్రాయస్థితికి వెళ్తారు. క్యాన్సర్ రావడం, నరాల బలహీనతకు గురవుతారు. మహిళలకు రసాయన ప్రభావంతో రుతుస్రావం సరిగా రాదు. గర్భిణులు ఈ మందులకు చాలా దూరంగా ఉండాలి. లేకపోతే పుట్టపోయే పిల్లలకు బుద్ధి మందగించడం, బలహీనత లక్షణాలు కనిపిస్తాయి. మాస్కులు, మందులు శరీరానికి తగలకుండా పూర్తిస్థాయిలో దుస్తులు ధరించాలి.



డాక్టర్ అలుగుబెల్లి జగన్‌రెడ్డి, ప్రభుత్వ వైద్యుడు, మిర్యాలగూడ

మందులు పిచికారీ చేసే రైతుల నుంచి సేకరించిన రక్త నమూనాల అధ్యయనంలో ప్రమాదకరమైన రోగాల బారిన పడుతున్నట్లు సంస్థ నివేదికలో వెల్లడించింది.

తప్పని పరిస్థితుల్లో చేస్తున్నాం



పంటల్లో తెగుళ్లవ్యాప్తి అధికమైంది. సాధారణ మందులు పనిచేయడం లేదు. దీంతో గాఢత ఉన్న మందులు పిచికారీ చేస్తున్నాం. దాంతో సమస్యలు వస్తున్నాయి. 20ఏళ్లుగా మందులు పిచికారీ చేస్తున్నా. తరచు జ్వరంతో పాటు, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, శారీరక బలహీనత, వంటి సమస్యలు వేధిస్తున్నాయి. క్రిమిసంహారక మందుల ప్రభావంతో రైతులు ఇబ్బందులు పడుతున్నా.. తప్పని పరిస్థితిలో పిచికారీ చేయాల్సి వస్తోంది. జాగ్రత్తలు తీసుకుంటున్నా ఇబ్బందులు తప్పడం లేదు.

సైదులు, రైతు

ఆంధ్రజ్యోతి సర్వే

పంటలపై వివిధ సందర్భాల్లో చేసే క్రిమిసంహారక మందుల వినియోగం, ఆ తర్వాత పరిణామాలపై ఆంధ్రజ్యోతి శాంపిల్ సర్వే నిర్వహించింది. ఇందులో విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి. 100లో 80మంది క్రిమిసంహారక మందుల పిచికారీ సమయంలో జాగ్రత్తలు తీసుకోవడం లేదు. జాగ్రత్తలు తీసుకోకుంటే అనారోగ్యం పాలవుతామన్న విషయం 50మందికి పైగా తెలుసు. అయినా పాతపద్ధతిలోనే పిచికారీ చేస్తున్నారు. ఇదిలా ఉండగా పిచికారీ చేసిన తర్వాత అనారోగ్యం పాలైన విషయాన్ని 60మంది గుర్తించారు. మొత్తంగా పిచికారీ సమయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడంతో రైతులు అనారోగ్యంపాలవుతున్న విషయం సర్వేలో స్పష్టమైంది.

1. పురుగు మందుల పిచికారీలో జాగ్రత్తలు తీసుకుంటున్నారా?

ఎ) అవును	బీ) కాదు	సీ) ఇకపై తీసుకుంటాం
10	80	10

2. జాగ్రత్తలు తీసుకోకుండా పిచికారీ చేస్తే అస్వస్థతకు గురవుతారని తెలుసా?

ఎ) తెలుసు	బీ) తెలియదు	సీ) తెలిసినా చేస్తున్నాం
30	50	20

3. పిచికారీ చేసిన తర్వాత కొద్దికాలానికి అనారోగ్య సమస్యలు వచ్చాయా?

ఎ) అవును	బీ) లేదు	సీ) గుర్తించలేదు
60	10	30

ప్రతీ ప్రశ్నకు100 మంది ప్రాతిపదికన చేసిన సర్వే

ఆదివారం ప్రత్యేకం

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తిరుమలగిరి క్రీడాకారులు



వల్లపు బ్రహ్మం, పిట్టల సంపత్

తిరుమలగిరి(సాగర్), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్)కు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. అండర్-19 నల్లగొండ జిల్లా జట్టు తరుపున మండలకేంద్రానికి చెందిన వల్లపు బ్రహ్మం, పిట్టల సంపత్ ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరిద్దరూ ప్రస్తుతం చింతపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. నేటి నుంచి 6వ తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లా రాచాలలో నిర్వహించనున్న 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు పాల్గొననున్నారు. వల్లపు బ్రహ్మం ఈ ఏడాది జనవరిలో కామారెడ్డిలో నిర్వహించిన సబ్ జూనియర్ తెలంగాణ రాష్ట్ర జట్టు తరపున పాల్గొని ప్రతిభను చాటాడు. ఈ క్రమంలో కామారెడ్డిలో నిర్వహించిన జాతీయ పోటీలకు రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి జట్టును 3వ స్థానంలో నిలపడంలో చక్కని ఆట తీరును కనబరిచాడు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన పిట్టల సంపత్ ఈ ఏడాది జనవరిలో సూర్యాపేటలో నిర్వహించిన సబ్ జూనియర్ పోటీల్లో జిల్లా జట్టు తరుపున ప్రాతినిధ్యం వహించాడు. ఈ క్రమంలో హాలియాలో నిర్వహించిన అండర్-19 సెలక్షన్స్‌లో జిల్లా జట్టుకు ఎంపికై నేటి నుంచి నిర్వహించనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో పాల్గొననున్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు చెర్వుఅన్నారం విద్యార్థులు



గాయత్రి, శ్రావణి

కట్టంగూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం చెర్వుఅన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. పాఠశాల హెచ్‌ఎం కందాల రమ, ఫిజికల్ డైరెక్టర్ చింతకాయల పుల్లయ్య తెలిపిన శనివారం వివరాలు వెల్లడించారు. అక్టోబరు 29న నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన బాలికల ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ జట్టుకు పాఠశాలలోని పదో తరగతి చదువుతున్న గాయత్రి, 9వ తరగతి చదువుతున్న శ్రావణిలు ప్రాతినిధ్యం వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. ములుగు జిల్లాలో జరుగుతున్న 38వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాలికల హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని వారు తెలిపారు. విద్యార్థినుల ఎంపికై ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు నిషాల్ ఎంపిక



నిషాల్


నాగార్జునసాగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ప్రభుత్వ కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థి అన్నుమోల్ నిషాల్ ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి 21 వరకు మధ్యప్రదేశ్‌లోని నర్మదాపురంలో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా టోర్నమెంట్‌లో నిషాల్ రాష్ట్రం తరుపున పాల్గొంటారని పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన నిషాల్‌ను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మర్యాల విద్యార్థులు



విద్యార్థినులను అభినందిస్తున్న టీచర్లు

బొమ్మలరామారం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మర్యాల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. శుక్రవారం సూర్యాపేటలో నిర్వహించిన అండర్-14 బాలికల ఖోఖో పోటీల్లో జగ్గారి హరిష్మా, కే శ్రేష్ఠ ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లా బాలికల జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 3, 4, 5వ తేదీల్లో కామారెడ్డిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థులను శనివారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు పగిడిపల్లి నిర్మల జ్యోతి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో రోజారాణి, పీడీ గోపాల్, శ్రీకాంత్, స్వరూపారాణి, సిద్ధ రాజు, ముఖిత్, రవీశ్వర్, సుజాత, శ్రీధర్, నాగజ్యోతి, శ్రీదేవి, సుష్మ, భవానీ పాల్గొన్నారు.



మఠంపల్లిలో సమాధులను పూలు, దీపాలతో అలంకరించిన క్రైస్తవులు

స్వార్థరహిత జీవనమే దైవ సన్నిధికి మార్గం

● ఆత్మల పండుగ సందర్భంగా సమాధుల అలంకరణ

మఠంపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్వార్థరహిత జీవనం సాగించే వారికే దైవసన్నిధికి చేరుకునే మార్గం సిద్ధిస్తుందని సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలోని శుభవార్త దేవాలయ విచారణ గురువు మార్టిన్ పసల అన్నారు. సకల ఆత్మల పండగను పురస్కరించుకుని మఠంపల్లి క్రైస్తవ శ్మశానవాటికలో శనివారం ఆత్మల పండుగాను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా నవంబరు 2న జరుపుకునే ఈ పండుగలో మరణించిన వారిని కుటుంబీకులు స్మరించుకోవడంతో పాటు వారికి పుణ్యలోక ప్రాప్తి కలిగేందుకు ప్రత్యేక ప్రార్థనలు చేసే సంప్రదాయం శతాబ్దాలుగా కొనసాగుతున్నట్లు వివరించారు. మానవళి జీవన సరళి పాపభీతి, ఆధ్యాత్మిక చింతనలతో సాగాలని ఉద్బోదించారు. విశ్వాసులు ఆత్మీయుల సమాధులను పుష్పాలతో అలంకరించి, కొవ్వొత్తులను వెలగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు శుభవార్త దేవాలయంలో విచారణ గురువుల మార్టిన్ పసల ప్రసంగం కొనసాగింది. ఆయనతో పాటు దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.



సమాధులను అలంకరిస్తున్న క్రైస్తవులు

కుటుంబ సర్వేకు సన్నద్ధం

(5వ పేజీ తరువాయి)

చేరవేస్తున్నారు. సర్వే వివరాల సేకరణ అనంతరం ఏకకాలంలో డేటాను కంప్యూటరైజేషన్ చేయనున్నారు. ఎట్టి పరిస్థితుల్లో డేటా ఎంట్రీలో తప్పుడు వివరాలు నమోదు కాకుండా ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు సర్వే విషయంలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. ప్రతీ ఎన్యూమరేటర్ 150 ఇళ్లను సర్వే చేయనున్నారు. ఈనెల 6వ ప్రారంభంకానున్న ఈ సర్వే 19వ తేదీ వరకు కొనసాగనుంది.

పకడ్బందీగా కుటుంబ సర్వే



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉంది. సమగ్ర ఇంటింటి సర్వేకు జిల్లాలో 4వేల మంది ఎన్యూమరేటర్లు అవసరం కాగా, ఇప్పటికే 2,800మంది అందుబాటులో ఉన్నారు. ఉపాధ్యాయులతో పాటు వివిధ శాఖల ఉద్యోగులను ఎన్యూమరేటర్లుగా తీసుకున్నాం. సర్వే అనంతరం డేటా ఎంట్రీ ఆపరేటర్‌లతో వివరాలను ఆన్‌లైన్ చేస్తాం. సమగ్ర ఇంటింటి సర్వేపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలల్లో విస్తృత ప్రచారం చేశాం. సర్వే నిర్వహించే ఎస్జీటీ టీచర్లకు ఈనెల 4, 5 తేదీల్లో శిక్షణ కూడా ఇస్తాం.

ఇలా త్రిపాఠి, నల్లగొండ జిల్లా కలెక్టర్

ప్రత్యేక విద్య టీచర్‌గా గిన్నెల స్వప్న

● ఐఆర్‌పీగా పనిచేసిన పాఠశాల్లోనే పోస్టింగ్



గిన్నెల స్వప్న

నార్కట్‌పల్లి, నవబంరు 2 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు గ్రామానికి చెందిన గిన్నెల స్వప్న నార్కట్‌పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక విద్యను బోధించే(ఎస్‌జీటీ) ఉపాధ్యాయురాలిగా నియామకమయ్యారు. జిల్లాలో మొత్తం 41 స్పెషల్ టీచరు పోస్టులు ఉండగా స్వప్న ఇటీవల ప్రకటించిన డీఎస్సీ-2024 ఫలితాల్లో 6వ ర్యాంకు సాధించింది. కాగా మానసిక విద్యను బోధించే కోర్సును నేర్చుకున్న స్వప్న పదేండ్లుగా నార్కట్‌పల్లిలోని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు బోధించే ఐఆర్‌పీగా కాంట్రాక్టు పద్ధతిన పనిచేశారు. ఇదే మండలంలోని అమ్మనబోలులో ప్రభుత్వ పాఠశాలల్లోనే పదవ తరగతి వరకు చదివిన స్వప్న హైదరాబాద్‌లోని ఠాగూర్ హరిప్రసాద్ కళాశాలలో బీఈడీ, డీఈడీ పూర్తిచేశారు. ఇదే పాఠశాలకు ఎస్‌జీటీ కేడర్‌లోనే ప్రత్యేక విద్యను బోధించే ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం పొందడం ఆనందంగా ఉందని స్వప్న అన్నారు. తన భర్తతో పాటు కుటుంబసభ్యుల సహకారంతో పట్టుదలతో చదివి మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించానన్నారు.

హైకోర్టు జడ్జి లక్ష్మణ్‌ను కలిసిన న్యాయవాదులు

రామన్నపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు జడ్జి జస్టిస్ కునూరు లక్ష్మణ్ దీపావళి సెలవులకు స్వగ్రామం యాదాద్రిభువనగిరి జిల్లా బోగారం రావడంతో రామన్నపేట బార్ అసోసియేషన్ సభ్యులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించి, పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఏ.మజీద్, సీనియర్ న్యాయవాదులు పి.అశోక్‌కుమార్, జినుకల ప్రభాకర్, ఉయ్యాల హనుమంతుగౌడ్, బి.డేవిడ్, నకిరేకంటి మొగులయ్య, నోముల స్వామి, దినేష్‌కుమార్, యాదాసు యాదయ్య, సుక్క శ్రవణ్‌కుమార్, దంతూరి సత్తయ్య, మామిడి వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.



హైకోర్టు జడ్జి లక్ష్మణ్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న బార్ సభ్యులు

ఐక్యరాజ్య సమితి సమావేశాలకు బ్రహ్మాచారికి ఆహ్వానం



మారోజు బ్రహ్మచారి

అర్వపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఐక్యరాజ్యసమితి నుంచి సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం కోడూరుకు చెందిన మారోజు బ్రహ్మచారికి ఆహ్వానం అందింది. ఈ నెల 4న స్విట్జర్లాండ్ దేశం జెనీవా నగరంలోని ఐక్యరాజ్యసమితి కార్యాలయంలో సునామీలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి ప్రపంచ మానవహక్కుల సమితి జాతీయ లీగల్ సెల్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న బ్రహ్మాచారికి ఆహ్వానం అందింది. ఆరేళ్లుగా డబ్ల్యూహెచ్‌ఆర్‌సీ తరపున సేవలు అందిస్తూ దేశంలో వివిధ కార్యక్రమాలల్లో బ్రహ్మాచారి పాల్గొంటున్నారు. ఐక్యరాజ్యసమితి సమావేశాలకు తెలంగాణకు నుంచి ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమని బ్రహ్మాచారి అన్నారు. ప్రపంచ మానవ హక్కుల సమితి, యునైటెడ్ పీస్‌కీపర్స్ ఫెడరల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఐక్యరాజ్య సమితి దేశంలో సుస్థిర లక్ష్యాలకు అనుగుణంగా సామాజిక, ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించడానికి కట్టుబడి పనిచేస్తుందని బ్రహ్మాచారి తెలిపారు. సమావేశాలకు హాజరయ్యే అవకాశం దక్కడం సంతోషకరమన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన నాగరాజు



మామిడి పవన్

అర్వపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన మామిడి పవన్ ప్రతిభచాటారు. అండర్-17 విభాగంలో నేరేడుచర్ల కళాశాలలో ఇంటర్ చదువుతున్న పవన్ రెండేళ్లుగా రాష్ట్ర స్థాయి జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అక్టోబరు 25 నుంచి 30వ తేదీ వరకు కరీంగనగర్ జిల్లా గోదావరిఖనిలో జరిగిన రాష్ట్ర పోటీల్లో పాల్గొన్నట్లు హెచ్‌ఎం బాలునాయక్ శనివారం తెలిపారు. పవన్‌ను గ్రామస్థులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు అక్కెనపల్లి విద్యార్థులు



విద్యార్థులతో ఉపాధ్యాయులు

నార్కట్‌పల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు నల్లగొండ జిల్లా అక్కెనపల్లి విద్యార్థులు ఎంపికయ్యారు. అక్టోబరు 29వ తేదీన నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్-17 బాలుర హాకీ జట్టు ఎంపికలో అక్కెనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు మద్రి నితిన్, రామ్ చరణ్ మంచి ప్రదర్శన కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు నడింపల్లి వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. విద్యార్థులు ఈ నెల 5వ తేదీన రంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ ఇమామ్ కరీం, సిబ్బంది పాల్గొన్నారు.

తుదిదశకు యాదాద్రి థర్మల్ పనులు

రాష్ట్రంలో విద్యుత్ కొరతలు తీర్చేందుకు నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం శివారులో చేపట్టిన యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమ పనులు తుదిదశకు చేరుకున్నాయి. 4,676 ఎకరాల్లో నాలుగు వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ కేంద్రాన్ని సుమారు రూ.40 వేల కోట్ల అంచనాతో ప్రారంభించారు. 85 శాతం పనులు పూర్తికాగా సుమారు రూ.35 వేల కోట్లు ఇప్పటికే వ్యయమైనట్లు సమాచారం. సెప్టెంబరు 11న యూనిట్-2 ఆయిల్ సింక్రనైజేషన్‌ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదివారం యూనిట్-1ను ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నారు.

(ఆంధ్రజ్యోతి-దామరచర్ల)



- రెండు యూనిట్ల పనులు ఇప్పటికే పూర్తి
- ఇప్పటికే 85 శాతం పూర్తి
- రూ.35 వేల కోట్లు వ్యయం

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద యాదాద్రి థర్మల్ పవర్ కేంద్రం ఏర్పాటుకు 2015లో అడుగులు పడ్డాయి. భూసేకరణ అనంతరం 2017లో టీఎస్‌జెన్‌కో సంస్థ పరిశ్రమ నిర్మాణ బాధ్యతలను బీహెచ్‌ఈఎల్‌కు అప్పగించింది. నాలుగు వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదు యూనిట్లకు పనులను ప్రారంభించారు. అందుకుగాను 4,676 ఎకరాల వివిధ రకాల భూములను పరిశ్రమ ఏర్పాటుకు సేకరించారు. పరిశ్రమ పరిధిలో ఖాళీ అయిన మోదుగులకుంట తండా, కపూరతండావాసులకు ఇతర చోట పునరావాసం కల్పించారు. అనంతరం పనులను వేగవంతం చేశారు. 2020 అక్టోబరు నాటికి రెండు యూనిట్లు, 2021 చివరి నాటికి మరో మూడు యూనిట్లు పనులు పూర్తి కావాలని గత ప్రభుత్వం నిర్దేశించుకున్నప్పటికీ కరోనా సమయంలో పనులు నిలిచి పనుల్లో వేగం తగ్గింది. తరువాత కాలంలో వేగంగా పనులను చేపట్టినప్పటికీ కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు విడుదల కాకపోవడంతో ఓ దశలో పనులు మందకొండిగా సాగాయి. గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వం పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉమ్మడి జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక దృష్టి సారించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యుత్‌ను వినియోగంలోకి తేవాలని అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. నిధులు సైతం మంజూరు కావడంతో ఇటీవల వేగంగా పనులు జరుగుతున్నాయి.

మంత్రుల పర్యటన ఇలా..

నల్లగొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు ఆదివారం నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో పర్యటించనున్నారు. మంత్రులు హెలికాప్టర్‌లో పర్యటనకు రానున్నారు. మధ్యాహ్నం 1.20గంటలకు దామచర్లలోని వైటీపీఎస్‌లో పవర్‌ప్లాంట్‌లో యూనిట్-1 ఆయిల్ సింక్రనైజేషన్ స్విచ్‌ఆన్ చేసి ప్రారంభిస్తారు.అనంతరం మొదటి విడతలో 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2.50గంటలకు సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్‌కు వెళ్లి గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లిలో రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం హుజూర్‌నగర్ లోని హౌసింగ్ కాలనీని సందర్శించి లబ్ధిదారులతో సమావేశమవుతారు. తిరిగి సాయంత్రం 4.30గంటలకు హైదరాబాద్ బయలుదేరి వెళ్తారు.

ఒక్కొక్కటిగా...

ఈ ఏడాది సెప్టెంబరు 11న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరిశ్రమలోని 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్-2 ఆయిల్ సింక్రనైజేషన్‌ను ప్రారంభించారు. 2025 మార్చి చివరి నాటికి మొత్తం ఐదు యూనిట్లను అందుబాటులోకి తీసుకొచ్చి 4 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్‌ను వినియోగంలోకి తీసుకొస్తామని వారు తెలిపారు. ఆ దిశగా పనులను వేగంగా జరిగేలా చర్యలు చేపట్టారు. 1, 2 యూనిట్ల పనులు పూర్తి చేసుకోగా 3, 4, 5 యూనిట్లు 85శాతం మేర పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా బొగ్గు రవాణా కోసం విష్ణుపురం నుంచి పరిశ్రమ లోపల డంపింగ్‌యార్డు వరకు ఎనిమిది కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన రైల్వేలైన్ పనులు పూర్తికావడంతో అధికారులు ట్రయల్ రన్ చేపట్టారు. ఇదిలా ఉండగా పరిశ్రమ నిర్మాణ అంచనా వ్యయం సుమారు రూ.35వేల కోట్లకు పైగా చేరినట్లు సమాచారం.



హుజూర్‌నగర్‌కు నేడు ముగ్గురు మంత్రుల రాక

హుజూర్‌నగర్, గరిడేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఆదివారం ముగ్గురు మంత్రులు పర్యటించనున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, పరిశీలించనున్నారు. హుజూర్‌నగర్, గరిడేపల్లి మండలాల్లో పర్యటించనున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు హుజూర్‌నగర్‌కు హెలికాప్టర్‌లో చేరుకుని ఫణిగిరిగట్టు వద్ద రూ.200 కోట్లతో నిర్మిస్తున్న హౌసింగ్ మోడల్ కాలనీని పరిశీలిస్తారు. అనంతరం స్థానికంగా ఉన్న లబ్ధిదారులతో మాట్లాడతారు. సుమారు ఇటీవల ప్రభుత్వం మోడల్ కాలనీ పూర్తికి రూ.75 కోట్లు నిధులు విడుదల చేయగా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం హౌసింగ్ మోడల్ కాలనీని ప్రతిష్ఠాత్మంగా తీసుకుంది. జనవరి నాటికి పూర్తిచేసి లబ్ధిదారులకు పంచాలనే లక్ష్యంతో ఉత్తమ్‌కుమార్ రెడ్డి దృష్టి సారించారు. ఈ నేపథ్యంలోనే భట్టి, కోమటరెడ్డిలతో పాటు పర్యటించనున్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేయగా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలో నిర్మించనున్న పాఠశాలకు మంత్రులు శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర మంత్రుల పర్యటన నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. అభివృద్ధి, శంకుస్థాపన కార్యక్రమాలలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ పాల్గొననున్నారు.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.150	230	250
సూర్యాపేట	రూ.150	220	250
నల్లగొండ	రూ.132	200	226

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	588.40
టీఎంసీలు	307.2834
ఎడమకాల్వకు నీటి విడుదల	6,870
కుడికాల్వకు	9,700
విద్యుత్ కేంద్రం ద్వారా	29,273
క్రస్ట్ గేట్ల ద్వారా	0
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,800 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	35,315 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	48,043 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	45.00 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	30,238 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	30,238 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	1

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.60 అడుగులు
టీఎంసీలు	4.10
ఎన్ని గేట్ల ద్వారా	1 గేట్లు
ఇన్‌ఫ్లో	834.49 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	834.49 క్యూసెక్కులు

నల్లగొండ జిల్లాలో ముగ్గురు నీటిలో గల్లంతు

- ఏఎమ్మార్పీ కాల్వలో తండ్రీకుమారుడు
- బీ.వెల్లెంల ఉదయసముద్రం రిజర్వాయర్‌లో ఒకరు
- పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు
- నల్లగొండ జిల్లా కనగల్, నార్కట్‌పల్లి మండలాల్లో ఘటన



శాబ్దులాపురం గ్రామ సమీపంలోని ఏఎమ్మార్పీ కాల్వలో గల్లంతైన తండ్రీ కుమారుడు సురవరం దామోదర్, ఫణీంద్రవర్మ



రోదిస్తున్న దామోదర్ భార్య, బంధువులు

కనగల్, నార్కట్‌పల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలో ముగ్గురు వ్యక్తులు నీటిలో గల్లంతయ్యారు. కనగల్ మండలం శాబ్దుల్లాపురం గ్రామంలోని ఏఎమ్మార్పీ కాల్వలో తండ్రీకుమారుడు గల్లంతు కా గా, నార్కట్‌పల్లి మండలంలోని బీవెల్లెంల ఉదయసముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టులో మరో వ్యక్తి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇ లా ఉన్నాయి. కనగల్ మండలంలోని శాబ్దులాపురం గ్రామానికి చెందిన సురవరం దామోదర్(41) నల్లగొండ మండలం బుద్దారం గ్రామంలో అ త్తగారింటి వద్ద ఉంటూ గృహ నిర్మాణ పనులు చేసుకుంటూ కుటుంబా న్ని పోషించుకుంటున్నాడు. దామోదర్ కాలుకు కొద్దిగా పోలియో సోకిం ది. దీంతో అతడికి దివ్యాంగుల ఆసరా పింఛన్ వస్తోంది. ప్రతి నెలా శా బ్దులాపురం గ్రామానికి వచ్చి వాటిని తీసుకొని వెళ్తుంటాడు. ఈ క్రమం లో పింఛన్ తీసుకునేందుకు శుక్రవారం రాత్రి అతడి కుమారుడు ఫణీంద్రవర్మను వెంట తీసుకుని శాబ్దులాపురం గ్రామంలోని ఇంటికి వచ్చాడు. శనివారం మధ్యాహ్నం దామోదర్ తన కుమారుడితో పాటు అన్న కుమారులైన జగన్, ప్రణవ్‌సాయిలను వెంట తీసుకుని గ్రామ శివారులోని ఏఎమ్మార్పీ కాల్వ వద్దకు స్నానానికి వెళ్లాడు. కాల్వ మెట్ల మీద కూర్చుని దామోదర్, ఫణీంద్రవర్మ (14) స్నానం చేస్తున్నారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు ఫణీంద్రవర్మ కాల్వలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో మునిగిపోతున్న ఫణీంద్రవర్మను కాపాడేందుకు తండ్రి దామోదర్ కాల్వలోకి దూకాడు. ఈ క్రమంలో ఇద్దరూ నీటి వేగానికి బయటి రాలేక నీటిలో గల్లంతయ్యారు. కాల్వ ఒడ్డున ఉన్న మరో ఇద్దరు పిల్లలు కొట్టుకుపోతున్న వారిని చూసి కేకలు వేశారు. భయపడి అక్కడి నుంచి పరుగులు తీసి విషయాన్ని గ్రామస్థులకు తెలిపారు వారు పోలీసులకు సమాచారం అందించగా, సంఘటనా స్థలానికి చండూరు సీఐ వెంకటయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ విష్ణుమూర్తి తన సిబ్బందితో కలిసి కాల్వలో గాలింపు చర్యలు చేపట్టారు. వీరికి తోడుగా అగ్నిమాపక సిబ్బంది, ఆర్ఐ యాదగిరి, రెవెన్యూ సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. సాయంత్రం వరకు గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఏఎమ్మార్పీ అధికారులతో మాట్లాడి కాల్వకు నీటి విడుదలను నిలిపివేయించారు. ఇదిలా ఉంటే ఫణీంద్రవర్మ నల్లగొండ పట్టణంలోని రామగిరి హైస్కూల్‌లో 8వ తరగ తి చదువుతున్నాడు. దా మోదర్‌కు భార్య ధనలక్ష్మి, ఒక కుమారుడు, ఇ ద్దరు కుమార్తెలు ఉన్నా రు. దామోదర్ భార్య ఫి ర్యాదు మేరకు కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు. తండ్రీకొడుకులు గల్లంతవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బీ.వెల్లెంల రిజర్వాయర్‌లో ఒకరి గల్లంతు



బ్రాహ్మణవెల్లెంల రిజర్వాయర్‌లో గల్లంతైన శంకర్ (ఫైల్ ఫొటో)

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టులో శనివారం ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. నల్లగొండ మండలం అప్పాజిపేట గ్రామానికి చెందిన గుండాల శంకర్ (47) ఇస్త్రీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తన కుమారుడు శివతో కలిసి నార్కట్‌పల్లి మండలంలోని నేరడలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బీ.వెల్లెంల రిజర్వాయర్‌కు నీటి విడుదల జరుగుతుండటంతో చూసేందుకు ఇద్దరూ కట్టపైకి వెళ్లారు. శంకర్ రిజర్వాయర్‌లో ఈత కొట్టేందుకు ప్రయత్నించాడు. కానీ, నీటి ప్రవాహం వేగంగా ఉండటంతో ఈత కొట్టలేక నీటిలో కొట్టుకుపోయాడు. సమీపంలోనే ఉన్న కొందరు అతడిని రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న ప్రాజెక్టు అధికారులు వెంటనే నీటి పంపింగ్ మోటార్‌ను నిలిపివేశారు. గల్లంతైన శంకర్ ఆచూకీ కోసం నార్కట్‌పల్లి సీఐ నాగరాజు ఆధ్వర్యంలో రెస్క్యూ బృందాన్ని తీసుకువచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. శంకర్‌కు భార్య ముగ్గురు కుమారులు ఉన్నారు. గల్లంతుపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో కానిస్టేబుల్ ఆత్మహత్య

- నల్లగొండ జిల్లా కేంద్రంలో ఘటన



రవిశంకర్ (ఫైల్)

నల్లగొండ క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని పూజిత అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న కలుకూరి రవిశంకర్ (42) యాదాద్రి భువనగిరి జిల్లాలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పిల్లల చదువులతో పాటు వివిధ కారణాలతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో కొద్ది రోజులుగా ముభావంగా ఉంటున్నాడు. ఇబ్బందులను అధిగమించేందుకు దారి తెలియకపోవడంతో మనస్తాపం చెందిన రవిశంకర్ శనివారం మధ్యాహ్నం కుటుంబసభ్యులు ఇంట్లో ఉండగానే బెడ్రూంలోకి వెళ్లి చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బెడ్ రూమ్ డోర్ తీసేసరికి రవిశంకర్ విగతజీవిగా మారాడు. అతడు పదేళ్లు హోంగార్డుగా పనిచేయగా, 2020లో కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందాడు. రవిశంకర్ ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతడి భార్య స్వాతి ఆర్టీసీలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రవిశంకర్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నల్లగొండ టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బస్సులు ఢీ.. 25 మందికి గాయాలు

కోదాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ సమీపంలోని కట్టకొమ్ముగూడెం వద్ద ఆగి ఉన్న ట్రావెల్స్ బస్సును శనివారం ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో రెండు బస్సుల్లోని 25 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు హైదరాబాద్‌లోని కుక్కడపల్లి నుంచి 36మంది ప్రయాణికులతో రాజమండ్రికి బయలుదేరింది. కోదాడ సమీపంలో రాగానే డ్రైవర్ కొత్తపల్లి లక్ష్మీనారాయణ ప్రయాణికులు బాతురూం కోసం రోడ్డు పక్కన బస్సు నిలిపాడు. హైదరాబాద్ నుంచి విజయవాడకు బయలు దేరిన టీఎస్‌ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి వెనుక నుంచి ట్రావెల్స్ బస్సును ఢీకొంది. దీంతో రెండు బస్సుల్లోని 25మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో ప్రథమ చికిత్స కోసం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. డ్రైవర్ లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళా అధికారికి ఫోన్‌లో వేధింపులు.. కేసు నమోదు

కోదాడటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పీఏనంటూ గుర్తుతెలియని వ్యక్తి ఓ మహిళా అధికారికి ఫోన్ చేసి వేధించాడు. ఇప్పటికే జైలులో ఉండి వచ్చానని, జైలుకు వెళ్లడం కొత్తకాదని, ఎవరూ ఏమీ చేయలేరని బెదిరించడం గమనార్హం. 'నేను ఎవరో నీకు తెలియదని, ఎంతవరకు ఉండాలో అంతవరకు ఉండు' అని గట్టిగా సమాధానం ఇచ్చారు. పిచ్చి, పిచ్చి మెసేజ్‌లు పెడితే ఏంచేయాలో అదే చేస్తానని హెచ్చరించారు. ఫోన్ చేసిన వ్యక్తిపై కోదాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్టు

మేళ్లచెర్వు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, ఒడిషా రాష్ట్రాల నుంచి మండల కేంద్రానికి గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తిని సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కోదాడ రూరల్ ఇన్‌చార్జి సీఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ, అజిత్‌నగర్‌కు చెందిన సింహాద్రి నాగరాజు స్థానిక సిమెంట్ పరిశ్రమంలో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఏపీ, ఒరిస్సా రాష్ట్రాల్లో గంజాయి కొనుగోలు చేసి స్థానికంగా ఉన్న స్నేహితులతో కలిసి గంజాయి విక్రయిస్తున్నాడు. గంజాయి సరఫరా చేస్తున్న నాగరాజును అదుపులోకి తీసుకున్న అతని స్నేహితులు అయిన మండలకేంద్రానికి చెందిన మహేష్, సిసింద్రి, నరేష్ కోసం గాలిస్తున్నారు. నిందితుడి నుంచి 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని నాగరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్ఐ పరమేష్, కానిస్టేబుల్ గోపయ్య, దిలీప్, వీరాంజనేయులు, రామకృష్ణలను డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతి



సూర్యాపేట క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళా మృతి చెందింది. సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జనగాం క్రాస్ రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. మహిళ మృతదేహన్ని సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. మహిళకు సంబంధించిన వారు సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.


గుర్తుతెలియని వాహనం ఢీకొని...

కోదాడ: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందాడు. కోదాడ సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన రాజపుత్ర గణేష్(21) దీపావళి పండుగకు కోదాడలో తన బావ కాసాని సత్యరాజు ఇంటికి వచ్చాడు. తిరిగి స్వగ్రామం వెళుతున్న క్రమంలో కోదాడ బైపాస్‌లో 65వ నెంబర్ జాతీయరహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సత్యరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యాదగిరిగుట్టలో కార్తీక సందడి

- ఆరు విడతల్లో 498 వ్రతాలు
- ఉభయ దర్శన క్యూలైన్లలో భక్తుల రద్దీ

భువనగిరి అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో శనివారం కార్తీక వ్రతాలు ప్రారంభమయ్యాయి. కార్తీక మాసం కావడంతో రాష్ట్రం నలూమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో కొండకింద వ్రత మండపాలు నిండిపోయాయి. అలాగే ఇష్టదైవాలను దర్శించుకొని ఆర్జిత సేవల్లో భక్తులు పాల్గొన్నారు. తెలంగాణ అన్నవరంగా ప్రసిద్ధికెక్కిన ఇక్కడి ఆలయంలో కార్తీక మాసంలో అధిక సంఖ్యలో వ్రతాలు నిర్వహించడం ఆనవాయితీ. ప్రారంభం రోజు ఆరు విడతల్లో జరిగిన వ్రతాల్లో 498 జంటలు సత్యదేవుడి వ్రతాలు ఆచరించి మొక్కు తీర్చుకున్నారు. వ్రత మండపాలు, పరిసర ప్రాంతాలను ఆలయ ఈవో భాస్కర్‌రావు పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. కార్తీక మాసం సందర్భంగా భక్తులు ఇష్టదైవాలను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొండపైన ఆలయం ఉత్తర రాజగోపురం ఎదుట, శివాలయం, కొండకింద లక్ష్మీపుష్కరిణి, వ్రత మండపం, వైకుంఠద్వారం వద్ద భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు.





నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు, సత్యనారాయణస్వామి వ్రతపూజలో పాల్గొన్న భక్తులు

స్వామి దర్శనానికి 34వేల మంది

కొండపైన ఇష్టదైవాలను దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులతో యాదగిరికొండపై సందడి నెలకొంది. దీపారాధన మండపాలు, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద కౌంటర్లు రద్దీగా మారాయి. సుమారు 34వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా, ఉభయ దర్శన క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రివరకు రద్దీ కొనసాగింది. రూ.150 ప్రత్యేక దర్శనానికి గంట, ధర్మదర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. ఆలయ ఉత్తర తిరువీధుల్లో భక్తులు ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు. అదేవిధంగా భక్తులను తరలించేందుకు కొండపైకి రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.42,25,956 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.





కార్తీకమాసం సందర్భంగా దీపాలను వెలిగిస్తున్న మహిళా భక్తులు

ధాన్యం కొనుగోళ్లు గాడినపడేనా!


నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్జాలబావి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నిల్వ ఉన్న ధాన్యం, ధాన్యం బస్తాలు

- కేంద్రాల వద్ద వెలుగులోకి పలు సమస్యలు
- గోదాముల వద్ద అన్‌లోడింగ్‌కూ ఆటంకాలే..
- మిల్‌పాయింట్లకు బారులు తీరుతున్న ధాన్యం ట్రాక్టర్లు
- మిల్లుల్లో సన్నధాన్యం అమ్ముకొని బోనస్ కోల్పోతున్న రైతాంగం

నల్లగొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): వరికోతలు ముమ్మరమవడంతో ధాన్యం అమ్మకాల్లో అన్నదాతల ఇక్కట్లు ఒక్కోటి వెలుగులోకి వస్తున్నాయి. సన్నధాన్యం సహా అన్నిరకాల ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకు వీలుగా ప్రభుత్వం జిల్లాలో విస్తృతంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు చేశారు. కానీ కేంద్రాల వద్ద ధాన్యం ఆరబెట్టుకునేందుకు కళ్లాలు లేకపోవడం, వచ్చిపోయే వానలతో ధాన్యం తడుస్తుండటం, కాంటాలయ్యాక ధాన్యం తరలించడానికి లారీలు, హమాలీలు అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు తెరమీదకు వచ్చాయి. శనివారం వరకు మిల్లర్లతోనూ అండర్ టేకింగ్ పూర్తవకపోవడంతో మిల్లులకు ధాన్యం పంపలేకపోయారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి స్వయంగా శుక్ర, శనివారాల్లో జిల్లాలోని పలు ధాన్యం కేంద్రాలను సందర్శించారు. క్షేత్రస్థాయి ఇబ్బందులు అవగతం చేసుకోవడంతో పాటు ధాన్యం అమ్మకాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అక్కడికక్కడే ఆదేశాలిచ్చారు. నల్లగొండలో గోదాముల వద్ద అయిదు రోజులుగా నిలిచిపోయిన లారీల సమస్యను కూడా కలెక్టర్ గుర్తించి తక్షణమే గోదాముల్లోకి ధాన్యం తరలించాలని సూచించారు. మరోవైపు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకోకపోవడంతో రైతులు ధాన్యాన్ని నేరుగా మిల్లు పాయింట్లకు తరలించి అమ్ముకుంటుండటంతో బోనస్ కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ధాన్యం అమ్మకానికి అవస్థలు

అకాలవర్షాలు ఒకవైపు వెంటాడుతుండటం, మరోవైపు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పూర్తిస్థాయి సదుపాయాలు లేకపోవడంతో రైతాంగం ధాన్యం అమ్మకాల్లో అవస్థలు ఎదుర్కొంటుంది. కొనుగోలు కేంద్రాల్లో హమాలీల కొరత, గన్నీ బ్యాగుల కొరత తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. ధాన్యం ఆరబెట్టుకోవడానికి కేంద్రాల వద్ద కళ్లాల సదుపాయం లేకపోవడం మరో సమస్యగా మారింది. తేమశాతం 17కి మించి ఉంటే కేంద్రాల్లో ధాన్యం కాంటాలు వేయడం లేదు. దీంతో కేంద్రాల వద్ద వేలాది బస్తాల ధాన్యం నిల్వ ఉంటుంది. జిల్లా కేంద్ర సమీపంలోని ఆర్జాలబావి కొనుగోలు కేంద్రం, శాలిగౌరారం మార్కెట్ యార్డు వద్ద కేంద్రంతో పాటు, తిప్పర్తి, కనగల్, మిర్యాలగూడ మార్కెట్‌యార్డు, వేములపల్లి ఇలా జిల్లా వ్యాప్తంగా అన్నిచోట్లా ఇదే పరిస్థితి నెలకొంది. కలెక్టర్ త్రిపాఠి సందర్శించినప్పుడు సైతం ఈ సమస్యలన్నీ రైతులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. కేంద్రాల వద్ద పరిస్థితి ఇలా ఉంటే, శనివారం వరకు మిల్లర్లకు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌కు మధ్య ఒప్పందం కూడా కుదరకపోవడంతో మిల్లులకు ధాన్యం కేటాయించలేదు. దీంతో గోదాములకు ధాన్యం లారీలు తరలించినా అక్కడ సకాలంలో దిగుమతులు లేకపోవడంతో అయిదారు రోజుల పాటు లారీలు నిలిచి ఉన్న పరిస్థితి కొనసాగింది. ఇప్పుడిప్పుడే కేంద్రాలు గాడినపడుతున్న నేపథ్యంలో నెలరోజుల పాటు సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు అవసరమైన గన్నీ బ్యాగులు, ధాన్యం కొన్న వెంటనే మిల్లులకు తరలించేలా ట్రాన్స్‌పోర్ట్, హమాలీల సమస్యలు లేకుండా చూడాలని, మిల్లుల్లోనూ కొర్రీలు వేయకుండా ధాన్యం దిగుమతి చేసుకునేలా అధికారులు పర్యవేక్షిస్తే తప్ప రైతులకు ధాన్యం అమ్మకాల్లో అవస్థలు తప్పని పరిస్థితి నెలకొంది.

కాంటాలు నిలిచిపోవడంతో తడిచిన ధాన్యం

దీపావళి పండుగ నేపథ్యంలో గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు జరగలేదు. దీంతో జిల్లాలోని పలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం తడిసి ముద్దయింది. ధాన్యం తడవకుండా కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయలేదని రైతులు ఆరోపిస్తున్నారు. నల్లగొండలోని ఆర్జాలబావి, శాలిగౌరారం తదితర ప్రాంతాల్లో ఆరబెట్టిన ధాన్యం అకాలవర్షానికి తడిసింది. ఆరేడు రోజుల పాటు కాంటాలు వేయకపోవడంతో రైతులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే కాంటాలు వేయాలని కోరుతున్నారు.

మిల్లు పాయింట్లకు ట్రాక్టర్లు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద వేగంగా కాంటాలు నడవడం లేదు. అంతేకాక సన్నధాన్యం ఆరబెట్టే పరిస్థితి లేక రైతులు ధాన్యాన్ని ట్రాక్టర్లలో నేరుగా మిల్లు పాయింట్లకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. మిర్యాలగూడ పరిసరాలలోని మిల్లులకు ధాన్యం ట్రాక్టర్లు బారులుతీరాయి. ఈ మిల్లుల్లో క్వింటాల్‌కు రూ.2400 వరకు ధర దక్కుతోంది. గతేడాది ఇదే మిల్లుల్లో ఇదే సీజన్‌లో 22 శాతం వరకు ఉన్నా క్వింటాల్‌కు రూ.2700 నుంచి రూ.2800 వరకు చెల్లించారు. కానీ ఈ ఏడాది మాత్రం రూ.2400, గరిష్ఠంగా రూ.2500కు మించి ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. అయితే సన్నధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన క్వింటాల్‌కు రూ.500 బోనస్, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తేనే దక్కుతుందని, మిల్లుల్లో అమ్ముకోవడం వల్ల రైతులు బోనస్ కోల్పోతుండటంపై కలెక్టర్, అదనపు కలెక్టర్ దృష్టి సారించాలని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.



ధాన్యం నిల్వలు ఉంచవద్దు : కలెక్టర్

జిల్లాలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్ర, శనివారాల్లో సందర్శించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు, సివిల్ సప్లై శాఖ అధికారులకు కీలకమైన ఆదేశాలిచ్చారు. వర్షాలు వస్తున్న నేపథ్యంలో కేంద్రాల వద్ద కాంటాలు వేసిన ధాన్యం నిల్వ ఉండకుండా తక్షణమే తరలించాలని సూచించారు. రైతులు తేమశాతం 17కి మించకుండా ధాన్యం తీసుకురావాలని, మట్టిపెడ్డలు, తాలు లేకుండా తీసుకువచ్చి ప్రభుత్వం మద్దతు ధర పొందాలని సూచించారు. సన్నధాన్యాన్ని నాణ్యతతో తీసుకువచ్చి అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ కూడా పొందాలని సూచించారు. కేంద్రాల వద్ద అవసరమైన టార్పాలిన్లు, కాంటాలు, గన్నీల కొరత లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

మిల్లులకు ధాన్యం కేటాయింపులకు రంగం సిద్ధం

జిల్లాలో రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయించేందుకు మిల్లర్లు శనివారం కలెక్టర్ త్రిపాఠితో జరిగిన సమావేశంలో అంగీకరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 10రోజుల బ్యాంకు గ్యారంటీ అండర్ టేకింగ్‌ని 15 రోజులకు పెంచాలనే మిల్లర్ల సూచనను కలెక్టర్ ఆమోదించారు. దీంతో తక్షణమే మిల్లర్లంతా అండర్‌టేకింగ్ సమర్పించడంతో ఆదివారం నుంచి మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేసేందుకు మార్గం సుగమమైంది. జిల్లాలో ఈ సీజన్‌లో దాదాపు 6లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని ప్రభుత్వం జిల్లాలో కొనుగోళ్లకు సిద్ధమైంది. కేంద్రాల నుంచి నేరుగా మిల్లులకు ధాన్యం పంపడం ద్వారా కాంటాలు వేగవంతమవుతాయని, అదే సమయంలో రైతులకు ఇబ్బంది తగ్గుతుందని భావిస్తున్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

నల్లగొండటౌన్, దేవరకొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని ఆదివారం ఉదయం 10.30 గంటలకు నల్లగొండ బస్టాండ్ ఎదురుగా గల సర్కిల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎస్ఈ వెంకటేశ్వర్లు తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. దేవరకొండ విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంలో వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు దేవరకొండ విద్యుత్ ఏడీఈ ఎస్.సైదులు తెలిపారు. వినియోగదారులు పాల్గొని వారి సలహాలు, సూచనలు తెలియజేయాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

మునుగోడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మండలంలోని కల్వకుంట్ల గ్రామానికి చెందిన మట్టిపల్లి లలితకు మంజూరైన రూ.60వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆయన అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, నాయకులు వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, రవి పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం రేపు

నకిరేకల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నకిరేకల్ మూసీరోడ్డులోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో 4వ తేదీన హైదరాబాద్ మాక్స్‌విజన్ శ్రీ మహాలక్ష్మి సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి. రామలింగం, కందుల సోమయ్య తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని విశ్రాంత ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ధాన్యం పరిశీలన

చిట్యాలరూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరెగూడెంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతుసంఘం నాయకులు పరిశీలించారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతుసంఘం మండల అధ్యక్షుడు లడె రాములు మాట్లాడుతూ కేంద్రాన్ని ప్రారంభించి రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు చేయకపోవడం దారుణమన్నారు. వర్షాలకు ధాన్యం కొట్టుకుపోవడం, తడిసిపోయి మొలకెత్తుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోటె తిరుమలయ్య, లడె శ్రీను, పేర్వాల రాములు, మురాల అంజయ్య, దొడ్డి మహేష్, సురేష్, మీనయ్య, శంకరయ్య, శేఖర్, మల్లయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కాస్మొటిక్ చార్జీల పెంపుపై హర్షం

దామరచర్ల, కొండమల్లేపల్లి, దేవరకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గిరిజన గురుకులాల్లో డైట్, కాస్మొటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచడంపై గిరిజన గురుకుల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడం గొప్ప విషయమన్నారు. డైట్, కాస్మొటిక్ చార్జీల పెంపుతో విద్యార్థులకు మేలు జరుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. కృతజ్ఞతలు తెలిపిన వారిలో దామరచర్ల, మల్లేపల్లి, దేవరకొండ మండలం కొమ్మేపల్లి గిరిజన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్స్ కవిత, శారద, రఘుపతి, గిరిజన గురుకుల అధ్యాపకులు చిరంజీవి, కరుణాకర్‌రెడ్డి, మాత్రు నాయక్, నరేందర్, నాగేశ్వర్‌రావు ఉన్నారు.

బీ.వెల్లెంల రిజర్వాయర్‌కు సందర్శకుల తాకిడి


రిజర్వాయర్‌లోకి వస్తున్న నీటిని చూస్తున్న సందర్శకులు

నార్కట్‌పల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లెంల ఉదయసముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టు రిజర్వాయర్‌కు సందర్శకుల తాకిడి పెరిగింది. మూడు రోజులుగా ఒక మోటారును 24 గంటల పాటు నడుపుతూ రిజర్వాయర్‌లోకి ప్రాజెక్టు నీటిని విడుదల చేస్తున్నారు. అధికారుల అంచనా ప్రకారం ప్రాజెక్టు మొత్తం నీటినిల్వ సామర్థ్యం 0.3 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.12 టీఎంసీల నీరు రిజర్వాయర్‌కు వచ్చి చేరినట్లు చెబుతున్నారు. ఇదిలా ఉంటే రెండు రోజుల పాటు దీపావళికి సెలవులు రావడంతో ఆయా గ్రామాల నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చి రిజర్వాయర్‌లోకి ఉప్పొంగి దుముకుతున్న కృష్ణవేణిని తిలకించి ఆనందానుభూతిని ఆస్వాదిస్తున్నారు. యువత సెల్ఫీలు తీసుకుంటూ మురిసిపోతున్నారు. రిజర్వాయర్‌లోకి నీరు చేరడంతో మరికొందరు చేపలు పడుతున్నారు.

బీసీల సత్తా చాటాలి


సభా ఏర్పాట్లను పరిశీలించి విలేకరులతో మాట్లాడుతున్న అర్జున్

మిర్యాలగూడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీసీ గర్జన సభకు వేలాది మంది హాజరై సత్తా చాటాలని బీసీ జేఏసీ కోకన్వీనర్ తమ్మడబోయిన అర్జున్ అన్నారు. ఎన్నెస్పీ మైదానంలో ఆదివారం జరగనున్న సభా ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం అర్జున్ విలేకరులతో మాట్లాడారు. ఆధిపత్య కులాలకు భోగాలు కాగా బీసీలకు త్యాగాలు మాత్రమే మిగిలాయని అన్నారు. సమాజంలో 60 శాతానికిపైగా ఉన్న బీసీలు ఉద్యమాల్లోనూ, పార్టీల జెండాలు మోయడంలో ముందుంటున్నా రాజ్యాధికారం దక్కక అస్థిత్వం లేని పరిస్థితుల్లోకి నెట్టివేయబడినట్లు తెలిపారు. బీసీ బంధువులందరూ నవంబరు 3వ తేదీన మిర్యాలగూడ ఎన్ఎస్పీ క్యాంపు గ్రౌండ్‌లో సాయంత్రం 3 గంటలకు జరిగే గర్జన సభలో అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోల సైదులు, కస్తూరి ప్రభాకర్, మారం శ్రీనివాస్, పుష్పాల సత్యం, కంచి సత్యనారాయణ, దాసరాజు జయరాజు, తిరుమలగిరి అశోక్, బంటు సైదులు, మహేష్‌గౌడ్, నాగరాజు, మురళి, శేఖర్, శ్రీనివాస్, సైదులు పాల్గొన్నారు.

● బీసీ గర్జన సభకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు తరలిరావాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు ఓట్లేసే యంత్రాలు గానే మిగిల్చారని అన్నారు. సమాజ మార్పు కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు నడుం బిగించాలని అన్నారు. సమావేశంలో బీసీ ఉద్యోగ సంఘం నాయకులు పులిజాల విష్ణుకుమార్, శ్రీనివాసచారి, రవికుమార్ యాదవ్, నగేష్‌యాదవ్ పాల్గొన్నారు.

బీసీ గర్జనను విజయవంతం చేయాలి


ఆలేటి శ్రీనివాస్

శాలిగౌరారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ ఎన్నెస్పీ క్యాంపులో ఆదివారం నిర్వహించే బీసీ గర్జనలో బీసీలంతా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు, హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లోని పవన్ సాయి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ కోరారు. శాలిగౌరారంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభాలో అత్యధిక జనాభా ఉన్న బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ హక్కుల సాధనకు చలో మిర్యాలగూడ బీసీ గర్జనను విజయవంతం చేయాలని డాక్టర్ శ్రీనివాస్ కోరారు.

నల్లగొండ టౌన్: మిర్యాలగూడ పట్టణంలోని ఎన్నెస్పీ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న బీసీల సింహగర్జనను విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్‌గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం సింహగర్జన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కర్నాటి యాదగిరి, ముత్తినేని శ్రీకాంత్‌వర్మ, జక్కుల వెంకన్న, కారింగ్ మహేష్, కొంపల్లి శ్రీకాంత్ ,రాజు రవి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్మన్ పదవిని బీసీలకు ఇవ్వాలి


టీపీసీసీ అధ్యక్షుడికి వినతిపత్రం అందజేస్తున్న లింగంగౌడ్

మిర్యాలగూడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బీసీలకు అవకాశం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. శనివారం టీ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా బీసీలకు అవకాశం రాలేదని అన్నారు. జిల్లాలో ఒకే సామాజిక వర్గానికి గ్రామస్థాయి నుంచి పార్లమెంటు దాకా పదవులు దక్కుతున్నాయని అన్నారు. పార్టీ పదవుల్లో బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం చైర్మన్ పదవి జనరల్ మహిళకు రిజర్వు అయినందున బీసీలకు అవకాశం కల్పించాలని కోరారు. ఎస్సీలకు, ఎస్టీలకు అవకాశం కల్పించినందున ఈసారి వర్గాల వారికి అవకాశం కల్పించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఆత్మల పండుగ


కట్టంగూరులో సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కేతేపల్లి, కట్టంగూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు శనివారం ఆత్మల పండగ (ఆల్ సోల్స్‌డే)ను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తమ కుటుంబాల్లో మరణించిన పూర్వీకులు, కుటుంబ సభ్యుల ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ ప్రతి ఏటా నవంబరు 2న క్రైస్తవులు ఈ పండగను నిర్వహించడం ఆనవాయితీ. ఈ పండగను పురస్కరించుకుని శ్మశానవాటికల్లోని తమ బంధువులు, ఆత్మీయుల స్మృతికట్టడాల(సమాధులు)ను శుభ్రం చేసి రంగులు వేసి పూలతో అందంగా అలంకరిస్తారు. ఇందులో భాగంగా మండలంలోని భీమారం, ఇనుపాముల, రాయపురం, కేతేపల్లి గ్రామాల్లో శనివారం ఉదయం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం గ్రామ శివారుల్లోని శ్మశానవాటికల్లో గల సమాధుల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలపై మత గురువులు ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి స్వర్గస్తులైన పెద్దలను స్మరించుకున్నారు. కేతేపల్లిలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో చర్చి విచారణ గురువు మాదాను ఫ్రాంచీస్, చర్చి కమిటీ ప్రతినిధులు పి.ఆరోగ్యం, కె.విజయకుమార్, బి.లూబెత్, పి.రవి, ఎం.వి జయరాజు, బి.జోసఫ్ పాల్గొన్నారు.


ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

చిన్నపూరిలో క్రైస్తవుల ఆధ్యాత్మిక కార్యక్రమం

కట్టంగూరు: కట్టంగూరు మండలంలోని చిన్నపూరి గ్రామస్థులు సకల ఆత్మల సంస్మరణ ప్రార్థనలు శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వేర్వేరు ప్రదేశాల్లో స్థిరపడిన గ్రామస్థులందరూ గ్రామానికి చేరుకొని వారి కుటుంబాల్లో మృతి చెందిన పెద్దల ఆత్మల నిమిత్తం విచారణ, గురువుల ఫాదర్ పసల గ్రేగోరి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సమాధుల ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమలో ఫాదర్ గ్రేగోరి కొంక ప్రవీణ్, శాంసన్ అలెగ్జాండర్, మారయ్య, ప్రణయ్, విలయం విజయ్, బాబు, ఆంథోని, ప్రసాద్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరులోనే 'సీడ్స్' కార్యాలయాన్ని కొనసాగించాలి

● జాతీయ రహదారిపై రైతుల ఆందోళన


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, యువకులు

నిడమనూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిడమనూరులోనే విత్తనాభివృద్ధి సంస్థ జిల్లా యూనిట్ కార్యాలయాన్ని కొనసాగించాలని రైతులు, యువకులు డిమాండ్ చేశారు. టీఎస్ సీడ్స్ జిల్లా యూనిట్‌ను నిడమనూరు నుంచి నందిపాడ్‌కు తరలించడాన్ని నిరసిస్తూ శనివారం మండలకేంద్రంలో కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై ధర్నాకు దిగి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మూడున్నర దశాబ్దాలుగా నిడమనూరులో రైతులకు సేవలందిస్తున్న సీడ్స్ జిల్లా కార్యాలయాన్ని నందిపాడ్‌కు తరలించి ఈ ప్రాంత రైతులకు అన్యాయం చేశారని ఆరోపించారు. సంస్థకు సొంత స్థలం లేదనే సాకుతో ఎత్తివేయడం తగదన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి సీడ్స్ కార్యాలయాన్ని తిరిగి నిడమనూరులో ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. రాస్తారోకోతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుండటంతో ఎస్ఐ గోపాల్‌రావు, పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులతో మాట్లాడి రాస్తారోకో విరమించేలా చేశారు. అనంతరం తహసీల్దార్ జంగాల కృష్ణయ్యకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఉన్నం ఈశ్వర్‌ప్రసాద్, కట్టా నర్సింహారావు, నల్లబోతు వెంకటేశ్వర్లు, కొండోజు కృష్ణాచారి, బొల్లం రవి, కొమాండ్ల గుర్వయ్య, కోమటి వెంకన్న, చామల యాదగిరిరెడ్డి, అన్నెబోయిన కొండల్, గన్నెపాక లక్ష్మణ్, ఉన్నం విజయభాస్కర్, గల్లా శేఖర్, కోలా శ్యామ్, కావేటి రాము, సురేష్, హరిప్రసాద్, అనిల్‌కుమార్, మహేష్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి


గీత కార్మిక జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న సీతారాములు

వేములపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చౌగాని సీతారాములు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కామేపల్లిగూడెంలో గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో సుమారు 30 వేల కుటుంబాలు గీత వృత్తే జీవనాధారంగా కొనసాగుతున్నాయన్నారు. వృత్తి పోరాటంలో గీత కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారని, ఇకపై ప్రమాదాలకు చోటులేకుండా కాటమయ్య రక్షణ సేఫ్టీ కిట్లను అందజేయాలని అన్నారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో తాటి, ఈత చెట్లు నరికి వేస్తున్నారని దీంతో ఉపాధి కోల్పోతున్నారన్నారు. ప్రమాదంలో చనిపోయిన గీత కార్మికునికి రూ.10లక్షలు, అంగవైకల్యం కలిగిన వారికి రూ.1లక్ష వెంటనే అందచేయాలన్నారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు లింగస్వామి, జిల్లా కమిటీ సభ్యులు నరసింహం, సైదులు, సత్తయ్య, అంజయ్య, ఈదయ్య, రవి, పాపయ్య, వెంకన్న, పెదనర్సయ్య, సుధాకర్, ముత్యాలు, బక్కయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తోన్న మోదీ

● కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్



సమావేశంలో మాట్లాడుతున్న స్కైలాబ్

నల్లగొండటౌన్, నల్లగొండ రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ అన్నారు. పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాలను క్షుణ్ణంగా పరిశీలించి అధ్యయనం చేసి, ఒకే తాటిపై నిలబెట్టడానికి కులం, మతం, భాష ప్రాంతాలకతీతంగా సమాన హక్కులను కలిగే విధంగా భారత రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున మాట్లాడుతూ అసమానతల రాజ్యాంగాన్ని అంతం చేయడం రాజ్యాంగం యొక్క ఉన్నతాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బొట్టు శివకుమార్, నాయకులు దైద శీను, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కుమార్తెతో పాటు మహిళ అదృశ్యం

● తిరుమలగిరి(సాగర్)లో ఘటన

తిరుమలగిరి(సాగర్), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కుటుంబంలో తలెత్తిన మనస్పర్థలతో మూడేళ్ల చిన్నారిని తీసుకొని వివాహిత ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ సంఘటన తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ కె.వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన మారుపాక ఊషయ్యకు నిడమనూరు మండలం ఊట్కూరు గ్రామానికి చెందిన భాషపాక నాగయ్య కుమార్తె మంజులతో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఒక కుమార్తె జన్మించింది. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరుచుగా వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 1వ తేదీన భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో మనస్థాపానికి గురైన మంజుల తన మూడేళ్ల జ్యోష్ణవిని తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆమె తన తండ్రి నాగయ్యకు ఇంట్లో నుంచి వెళ్తున్నానని ఫోన్‌లో తెలియజేసింది. దీంతో ఆమె తండ్రి, కుటుంబీకులు తిరుమలగిరికి వచ్చి విచారించారు. అంతేకాక బంధువులను ఆరా తీయగా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి నాగయ్య పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మహిళతో పాటు పాప మిస్సింగ్‌పై కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ వీరశేఖర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రెండు గొర్రెలు మృతి

డిండి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రెండు గొర్రెలు మృతి చెందాయి. ఈ సంఘటన డిండి మండలం బొల్లనపల్లి గ్రామంలో శనివారం జరిగింది. బాధితుడు జక్కుల పెద్ద జంగయ్య తెలిపిన వివరాల ప్రకారం... బొల్లనపల్లి గ్రామానికి చెందిన పెద్ద జంగయ్య తన గొర్రెల మందను మేపేందుకు అడవి వెళ్తున్నాడు. గ్రామ శివారులోని ఓ రైతు తన పొలం చుట్టూ ఇనుప కంచె వేసుకున్నాడు. గొర్రెల మందలోని రెండు గొర్రెలు విద్యుత్ సరఫరా అవుతున్న ఇనుప కంచెకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. విద్యుత్ మోటార్ స్టార్టర్ డబ్బాను ఇనుప కంచెకు వేసేందుకు నాటిన రాతి స్తంభానికి కట్టడంతో పాటు విద్యుత్ వైర్లను కంచె ఇనుప తీగకు చుట్టారు. విద్యుత్ సరఫరా కావడంతో గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల విలువ రూ.20 వేలు ఉంటుందని బాధితుడు జంగయ్య తెలిపాడు.

'అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి'

వేములపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీదేవిగూడెం గ్రామంలో గిరిజన మహిళపై అత్యాచారానికి పాల్పడిన గంటా కృష్ణయ్యయాదవ్‌పై ఎస్సీ, ఎస్టీ, నిర్భయ కేసు నమోదు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా ఎరుకుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వజ్రగిరి అంజయ్య ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏఎస్ఐ నరసింహారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ గిరిజన మహిళపై అత్యాచారానికి పాల్పడటంతో అవమానభారంతో ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని అన్నారు. సంఘటన జరిగి రోజులైనా నిందితుడిని అదుపులోకి తీసుకోకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల శ్రీనయ్య, రుద్రాక్ష బాస్కర్, సయ్యద్‌షారుఖ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

నకిరేకల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నకిరేకల్, తాటికల్ జడ్పీ హైస్కూల్‌కు చెందిన 9, 10వ తరగతి చదువుతున్న 70 మంది మెరిట్ విద్యార్థినీ విద్యార్థులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున ఈ ప్రాంతానికి చెందిన రంజిత్‌కుమార్ ప్రోత్సాహక నగదు బహుమతులు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో నాగయ్య, హెచ్ఎం రాములు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సామాజిక స్ఫూర్తి, పోటీ తత్వాన్ని పెంచేందుకు సహాయం చేస్తున్నారని వారు తెలిపారు.

చిట్యాలలో కారు దగ్ధం

చిట్యాలరూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నడుస్తున్న కారులో మంటలు వ్యాపించి కారు దగ్ధమైంది. ఈ సంఘటన చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. గ్రామస్థులు, వాహనదారులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కారు శుక్రవారం అర్ధరాత్రి మండలంలోని గుండ్రాంపల్లి శివారులోకి వచ్చి ఆగింది. కారులో ప్రమాదవశాత్తు పొగలు, చిన్నమంటలు వచ్చాయి. దీంతో కారును నడుపుతున్న వ్యక్తి కారును ఆపి బయటకు వచ్చాడు. ఈలోగానే కారులో మంటలు వేగంగా వ్యాపించి దగ్ధమైంది. గ్రామస్థులు యాదాద్రి-భువనగిరి జిల్లా రామన్నపేటలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక శకటం వచ్చే లోపే కారు మంటల్లో పూర్తిగా దగ్ధమైంది. సిబ్బంది నీటితో మంటలను ఆర్పారు. కారు నడుపుతున్న వ్యక్తి వివరాలు తెలియరాలేదు. కారు దగ్ధమైన సంఘటన గురించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చిట్యాల పోలీసులు పేర్కొన్నారు.